# ఉత్సాహ భరితం.. ఝురి ఉత్సవం

- భారీగా పాల్గొన్న భక్తజనం
- కోనేరులో స్నానం.. భక్తిశ్రద్ధలతో పూజలు
- ఆకట్టుకున్న దేవేరెద్దులు

**కలికిరి :** మహాశివరాత్రి వేడుకల్లో భాగమైన ఝురి ఉత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. శనివారం రాత్రి జాగారణ ఆచరించిన భక్తులు ఆదివారం ఉదయం నుంచి ఝురి(కోనేరు) స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడికుర్తిలో అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం, దేవరెద్దు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బాహుదా నదిలో ఝురి ఉత్సవం చేపట్టారు. పూలకొండలో వెలసిన మల్లేశ్వరస్వామి, అమ్మవారి కల్యాణోత్సవం జరిగింది. పట్టణంలోని సోమేశ్వరస్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. కార్యక్రమాల్లో సోమేశ్వరాలయ నిర్వాహకులు మహిస్వామి, యల్లారెడ్డి, పుల్లారెడ్డి, పూలకొండ ఆలయ నిర్వాహకులు బాలరెడ్డెప్పనాయునివారు, వెంకటస్వామి, మేడికుర్తి అగస్త్యేశ్వర ఆలయ నిర్వాహకులు రత్నశేఖర్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**అగస్త్యేశ్వరుని సేవలో ఎమ్మెల్యే చింతల**

మేడికుర్తి అగస్త్యేశ్వరస్వామిని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం వారు దేవరెద్దుకు పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, నాయకులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**కాశీవిశ్వేశ్వరస్వామి ఊరేగింపు**

**పీలేరు :** స్థానిక శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం శనివారం రాత్రి జాగారణ చేసిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీకాశీవిశ్వేశ్వరసామి ఆలయం నుంచి శివపార్వతులను పట్టణంలో ఊరేగించారు. అనంతరం పీలేరు శివారు ప్రాంతం శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో త్రిశూల స్నానం వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ నిర్వహించారు. మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీ శివరామపురంలో శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు.


పీలేరు : కాశీవిశ్వేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

**వృషభవాహనంపై శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి**

**కలకడ :** కలకడ శ్రీకామాక్షిసమేత సిద్ధేశ్వరస్వామి మండలంలోని నాయుడు కులస్తులు ఏర్పాటు చేసిన వృషభవాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చాందినీబండిపై విహరించి పూజలు అందుకున్నారు. ఆదివారం ఆలయ ప్రవేశం చేశారు.

**మల్లేశ్వరస్వామి ఆలయంలో..**

**పీలేరు రూరల్ :** మండలంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వరస్వామి ఆలయంలో ఝురి ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఝురి స్నానం ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. పాకాల మండలం ఐరాల నుంచి విచ్చేసిన దేవరెద్దులు, నాణ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


కేవీపల్లె : ఝురి ఉత్సవానికి వెళ్తున్న నాణ్యాలు

**లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో..**

**వాల్మీకిపురం:** స్థానిక కోనేటివీధిలో ఉన్న శ్రీ లక్ష్మీ కామేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం అభిషేకం, అర్చన, హోమాలు చేశారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోనేటివీధి, నిమ్మనపల్లె రోడ్డులోని దేవాలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిమ్మనపల్లె రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, వీరన్న కొండపై ఉన్న వీరభద్రస్వామి ఆలయం, పాతమంచూరు ఆంజనేయస్వామి ఆలయం, పడమర పొలిమేర ధర్మపథంలో ఉన్న శ్రీలింగోద్భవ మహాశివుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, నగరోత్సవం నిర్వహించారు. పడమర ధర్మపథంలో శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం నూతన వధూవరులను రథోత్సవంపై అధిరోహింపజేసి నగరోత్సవం నిర్వహించారు. మండలంలోని చింతపర్తిలో శ్రీ ఓబులేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనందరెడ్డి, కేశవరెడ్డి, కువైట్ శంకర, మానవతా సంస్థ అధ్యక్షులు క్రిష్ణమూర్తి, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోనవరపు శీనాస్వామి పాల్గొన్నారు.

**మండల సరిహద్దులో..**

**కేవీపల్లె :** కలకడ, కేవీపల్లె మండలాల సరిహద్దులోని ఝరికోన ఉత్సవానికి మండలం నుంచి అధిక సంఖ్యలో నాణ్యాలు, దేవేరెద్దులతో భక్తులు తరలివెళ్లారు. కేవీపల్లె మండలంలోని వంకవడ్డిపల్లె, తోటిదళితవాడ, చిన్నకమ్మపల్లె, గుట్టలపై గ్రామం, మారేళ్ల, నారమాకులవడ్డిపల్లె తువ్వపల్లె, గువ్వలగుడ్డెం, గాలివారిపల్లె తదితర ప్రాంతాల నుంచి దేవరెద్దులు, నాణ్యాలు పెద్ద ఎత్తున తీసుకువెళ్లారు. భక్తిశ్రద్ధలతో, మంగళవాయిద్యాలు, బళ్లారి డ్రమ్స్, కొలాటం, చెక్కభజనలు, పిల్లనగ్రోవిలతో నాణ్యాలు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఝరిస్నానమాచరించి మొక్కులు చెల్లించారు. గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లెలో శ్రీ మల్లికార్జున స్వామి, వగళ్లలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


వాల్మీకిపురం : శివపార్వతుల రథోత్సవం


కలికిరి: మేడికుర్తిలో దేవరెద్దు పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

# వైభవం.. రథోత్సవం


పెద్దతిప్పసముద్రం : సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రథోత్సవం


పెద్దతిప్పసముద్రం : ప్రసన్నపార్వతి, సంగమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు


బి.కొత్తకోట : పోతబలేశ్వర శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం


కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై అన్నదానం

**మార్మోగిన శివనామస్మరణ**

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని టి సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ ప్రసన్న పార్వతి, సంగమేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల నుంచి ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవానికి భక్తులు ఉపవాస దీక్షతో వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రతిమలను ఆలయం నుంచి తేరు వరకు భక్తులు పల్లకిలో మోసుకుంటూ వెళ్లారు. అనంతరం భక్తులు శివనామ స్మరణలతో రథాన్ని లాగారు. వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. శివనామ స్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఉత్సవాలను తిలకించేందుకు పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల వాసులే గాక సరిహద్దులో వున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఉచిత అన్నదానం, తాగునీటి సౌకర్యంతోపాటు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. బెంగళూరు రూరల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసంతి అమర్, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సాయి లోకేష్, పారిశ్రామికవేత్త వేణుగోపాల్, ఆలయ కమిటీ నిర్వాహకులు పీ.శ్రీనాథ్‌రెడ్డి, అంజనేయరెడ్డితోపాటు స్థానిక సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ పీఎస్ మధు, ఎంపీటీసీ జయలలిత, రామిరెడ్డితోపాటు పార్టీలకతీతంగా నాయకులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**నేడు పీటీఎంలో రథోత్సవం**

స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజుల నుంచి శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం రథోత్సవం జరుగునని ఆలయ కమిటీ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య పేర్కొన్నారు.

**అంగళ్లు మల్లయ్యకొండపై..**

**కురబలకోట :** కురబలకోట మండలం అంగళ్లు మల్లయ్యకొండపై ఆదివారం శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణం కన్నుల పండవలా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేపట్టారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు భాస్కర్‌రెడ్డి, రమణ, తిరుపతి నాయుడు, బాబురెడ్డి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారిని తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు, ఎస్‌ఐ సుకుమార్ అభినందించారు.

**మల్లన్న సన్నిధిలో..**

అమెరికాలోని ప్రముఖ డీవీఆర్ సాఫ్టెక్ ఐఎన్‌సీ కంపెనీ సీఈఓ, అండ్ చైర్మన్ దేవులపల్లె రమణారెడ్డి అంగళ్లు దగ్గరున్న మల్లయ్యకొండను దర్శించుకున్నారు. ఆయనను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్యకొండ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

**వైభవంగా కల్యాణోత్సవం**

**బి.కొత్తకోట :** మండల పరిధి నాయనబావి పంచాయతీ ఆకులవారిపల్లె సమీపంలోని పురాతన పోతబలేశ్వర శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి దంపతులు వేడుకలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. శీలంవారిపల్లె పంచాయతీ తోకలపల్లెలోని శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. సర్పంచు భీమిగాని నాగిరెడ్డి, పవర్‌వాటర్ టెక్ ఎండీ బి.పద్మనాభరెడ్డి, సెరికల్చర్ రిటైర్డ్ మాజీ జేడీ చేలూరి శివారెడ్డి పాల్గొన్నారు.

## తిరునాల.. జనహేల

**కోలాహలంగా నేలమల్లేశ్వరుని జాతర**

**నిమ్మనపల్లె :** మండలంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి పగలు తిరునాల(జాతర) ఆదివారం కోలాహలంగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు చాందిని బండ్లు కట్టుకుని, డప్పు, మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేశారు. శనివారం రాత్రి నుంచి భక్తుల తాకిడి అధికమైంది. ఈవో మంజుల, ఉత్సవాల ప్రత్యేక అధికారి రవికుమార్, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శనివారం రాత్రి శ్రీకామేశ్వర కల్యాణాన్ని ఆలయ పూజారులు శంకరశర్మ, లక్ష్మణస్వామి తదితరులు వైభవంగా నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టుకు లింగోద్భవ పూజలు చేశారు. ఎస్‌ఐ ఫాతిమా పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గంగాధర, శంకర, రమేష్, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

**శివాలయాల్లో రుద్రాభిషేకాలు**


**మదనపల్లె సిటీ:** మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆంజినేయులు, కౌన్సిలర్ సుగుణలు భక్తులకు అన్నదాన సంతర్పణ చేశారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు చేశారు. నిర్వాహకులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఉట్ల తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదుట ఉట్లమానును యువకులు ఉత్సాహంగా ఎక్కి ఉట్టి కొట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా వేంపల్లె మల్లయ్యకొండలో వెలసిన మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లి పూజల్లో పాల్గొన్నారు.


రామసముద్రం: గుంతయంబాడిలోని పుండరీశ్వరస్వామి


నిమ్మనపల్లె : కామేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

**ఘనంగా ఉట్ల తిరునాళ్ల**

**రామసముద్రం :** మండలంలోని గుంతయంబాడి గ్రామంలో ఆదివారం ఘనంగా ఉట్ల తిరునాళ్ల నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన ఉట్ల తిరునాళ్లకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. మూగవాడిలోని శ్రీపండీశ్వరస్వామి, బల్లసముద్రంకొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి రామసముద్రం వాలీశ్వరస్వామి, చంద్రశేఖరస్వామి, చెంబకూరులోని కాశీశ్వరస్వామి, నరసాపురంలోని మునీశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవం నిర్వహించారు.


మదనపల్లె సిటీ : సోమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## పెరిగిన మల్లయ్యకొండ ఆదాయం


తేరుపై ఊరేగుతున్న మల్లికార్జునస్వామి


చైర్మన్, ఈవో సమక్షంలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

**తంబళ్లపల్లె :** మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ సందర్భంగా భక్తులు స్వామి వారికి చెల్లించిన కానుకల ద్వారా ఈ ఏడాది ఆదాయం పెరిగింది. శనివారం రాత్రి శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవం, రథోత్సవం కనుల విందుగా సాగాయి. ఉత్సవ విగ్రహాలను రథంలో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మల్లయ్యదారులు ఆకర్షణీయమైన వస్త్రధారణతో వెలుగుబంటి టోపీ ధరించి ఢమరుకం వాయిస్తూ, పిల్లనగ్రోవి ఊదుతూ చేసిన నృత్యవిన్యాసం భక్తులను అలరింపచేసింది. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి, ఈవో రమణ ఆధ్వర్యంలో కానుకల లెక్కింపు జరిగింది. అర్చన టికెట్ల అమ్మకం ద్వారా రూ.73,790, అభిషేకం టికెట్లతో రూ.4200, తలనీలాల టికెట్లతో రూ.31,725, మెరవని రూ.23 వేలు, స్వామివారి కల్యాణం చదివింపుల ద్వారా రూ.22,360, ప్రత్యేక హుండీద్వారా రూ.2,15,800, శాశ్వత హుండీద్వారా రూ.4,82,012, తాత్కాలిక హుండీతో రూ.4,23,680, చందాల ద్వారా రూ.33,674, మొత్తం రూ.13,10,241 ఆదాయం వచ్చిందని చైర్మన్, ఈవో తెలిపారు.

## 26న హిందీ ప్రతిభ పరీక్ష

**రాజంపేట టౌన్ :** పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి టెన్త్ విద్యార్థులకు హిందీ ప్రతిభ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు హిందీ పాఠ్యాంశంలో అత్యుత్తమ మార్కులు సాధించాలన్న ఆశయంతో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ప్రతిభ పరీక్షను నిర్వహించనున్నట్ల తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6303701314 నెంబర్‌లో సంప్రదించవ్చని తెలిపారు.

## స్కేటింగ్‌లో ప్రతిభ

**ఓబులవారిపల్లె :** నేపాల్ ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి అండర్-7 స్కేటింగ్ పోటీల్లో మంగంపేట ఏపీఎండీసీ రెండవ తరగతి విద్యార్థి నందలూరు హార్దిక్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. ఆదివారం వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్ రెడ్డి హార్దిక్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో గుంతకల్ రైల్వే డివిజన్ సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## రామసముద్రంలో డార్క్‌ఏరియా ఎత్తివేస్తూ ఆదేశాలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి

**రామసముద్రం:** రామసముద్రంలో డార్క్ ఏరియా ఎత్తివేస్తూ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం చిత్తూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రామసముద్రం జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని దండువారిపల్లెకి ప్రభుత్వ బోరుకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్, పైపులైన్ మంజూరు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మండల అభివృద్ధికి కృషి చేస్తూ డార్క్ ఏరియా ఎత్తివేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## క్లుప్తంగా

### ఏనుగుమల్లమ్మ సేవలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

**బి.కొత్తకోట :** మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనగుమల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు పూజలు పూర్తి చేశాక ఆశీర్వచనం అందించారు. ఆలయ ధర్మకర్త జి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో సత్కరించారు.

### నేడు పీలేరులో ఎమ్మెల్యే పర్యటన

**పీలేరు :** పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్‌లో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**నేడు గృహసారథులకు అవగాహన సదస్సు**

**వాల్మీకిపురం :** స్థానిక సీపీ మహల్‌లో సోమవారం ఉదయం 9:30 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు సీఖ్రభాస్కర్ తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

### ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

**పీలేరు రూరల్ :** పీలేరులో ఛత్రపతి శివాజీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అజంతామిట్టన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివాజీ అభిమానులు మనోజ్‌కుమార్, పూలకుమార్ యుగంధర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ ఆదాయంపై విచారణ జరిపించాలి

**మదనపల్లె :** పట్టణంలోని వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన ఆదాయం దుర్వినియోగంపై అఖిలపక్ష కమిటీ సభ్యులతో విచారణ జరిపించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ముజీబ్‌హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆదాయానికి సంబంధించి నిధులు దుర్వినియోగం జరిగినట్లు పట్టణంలో వదంతులు వినవస్తున్నాయని, వీటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపేందుకు మదనపల్లె బచావో పేరుతో కమిటీని వేయాలన్నారు.

### హరితకు ప్రతిభా అవార్డు


సత్కారం పొందుతున్న హరిత

**పీలేరు :** స్థానిక శ్రీ నటరాజ కళామందిర్ నిర్వాహకురాలు హరితకు కూచిపూడిలో ఉత్తమ గురువు ప్రతిభా అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణా వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హరిత తమ శిష్యులు రజిత, అఖిల్‌తో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. దీంతో శిక్షణ ఇచ్చిన హరితను ఉత్తమ గురువుగా ఎంపిక చేసి.. ఆమెను నిర్వాహకులు పైడి అంకయ్య, సినీ నటులు గౌతంరాజు, సుదర్శన్‌రావు చేతుల మీదుగా ప్రతిభా అవార్డుతో సత్కరించారు.

### గుండెపోటుతో టూరిజం ఉద్యోగి మృతి


మురళీ (ఫైల్)

**బి.కొత్తకోట:** బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై టూరిజం ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.మురళీకృష్ణ (54) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మదనపల్లెలో ఉంటున్న ఆయన 20 ఏళ్లుగా టూరిజంలో పని చేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా మదనపల్లెలో ఉన్న మురళీకృష్ణకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు టూరిజం వర్గాలు తెలిపాయి. ఆదివారం మదనపల్లెలో అంత్యక్రియలు నిర్వహించగా టూరిజం ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు.

### కవులకు సన్మానం


యుగంధరాచారికి మెమెంటో అందజేస్తున్న సాహితీ సమాఖ్య అధ్యక్షులు

**మదనపల్లె సిటీ :** అంతర్జాతీయ భాష దినోత్సవం పురస్కరించుకుని పలమనేరు తెలుగు సాహితీ సమాఖ్య మదనపల్లెకు చెందిన కవులను సన్మానించారు. ఆదివారం పలమనేరులో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె రచయితల సంఘం (మరసం) కార్యదర్శి లింగాల యుగంధరాచారి, సభ్యులు నాగరాజు, రామమోహన్‌నాయుడుకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సమాఖ్య అధ్యక్షులు తులసీధర్‌నాయుడు పాల్గొన్నారు.

### మనిషి జీవితం సన్మార్గంలో సాగాలి


వాక్యోపదేశం చేస్తున్న వరప్రసాద్

**కురబలకోట :** మనిషి జీవితం–జీవనం సన్మార్గంలో సాగాలని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం (షార్) మాజీ జనరల్ మేనేజర్, సైంటిస్టు ఆర్.వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన ఆరాధన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాక్యోపదేశం చేశారు. విదేయత, విశ్వాసం ఉన్న వారికి దేవుడు వెన్నుదన్నుగా నిలుస్తారన్నారు. మరో అతిథి అశోక్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.